# చేను మేసిన కంచె

పి. వి. రమణ



నింగికీ, నేలకూ పిటిముక్కుల వల వేసినట్లు ఉదయం నుండీ ఎడ తెరిపి లేని వర్షం. జలపాతాలకు రెక్కలు వచ్చి జడలు విదిలించి ఆడుకొంటున్నట్లు ఒకటే కుంభవృష్టి. ఊరూ వాడా, వాగూ వంకా ఏకమై పోతున్నట్లు వీథుల్లో వరద.

రంగనాయకులు తాను మ్యునిసిపల్ ఛెయిర్మన్ ఆసనాన్ని ఆలింగనం చేసుకొన్న సంవత్సరంలోనే తన రాజకీయ ఘటనా ఘటన చాతుర్యానికి నిదర్శనంగా, ప్రజాసేవకై పెట్టిన పెట్టుబడికి, రాబట్టుకొన్న గిట్టుబడికి పరమార్థంగా ఆకాశంలోకి చొచ్చుకొని పోయిన ఆయన

అందాల భవనం అంత వర్షంలోనూ నిగనిగలాడుతూనే ఉంది. ఇంకా నిటారుగా నిలబడే ఉంది. పై అంతస్తులో నిలబడి ప్రవహిస్తున్న నీటివంకే కన్నార్పకుండా చూస్తూ ఉన్న రంగనాయకుల మనసు నిండా ఎన్నో భయాలు, ఎన్నో సందేహాలు. ఆకాశం తన గుండె చీల్చి ఇంత నీటిని భూమికి పంపుతున్నా అది ఉన్న చోటే ఉండటం లేదు. ఎవెటో పోతు న్నది. ఎక్కడికో చేరుతున్నది. తన గోడౌన్స్‌లోని సరుకు గతికూడా ఇంతేనా?

ఉన్నట్టుండి ఒక ఉరుము. ప్రకృతితో బాటు రంగనాయకుల గుండెకూడా దడదడలాడింది. మెలి పెట్టిన కోరమీసాలు కిందికి దిగజారాయి. అటు పది, ఇటు పది గ్రామాల గుత్తాధిపత్యాన్ని పగ్గాలు వేసి నిలబెట్టిన ఆయన వాడి చూపులు వెలవెల పోయినాయి. దానికి కారణం ఈ ఉరుమే కాదు; పొద్దుట తన కందిన వార్త. అది వార్త కాదు; పరిధులు దాటి ప్రాకిపోతున్న తన పలుకుబడికి పెద్ద వాత. అక్రమ నిల్వలతో అప్రూపంగా బలిసిన తన గోడౌన్స్ ఏ క్షణంలోనైనా నిఘా విభాగం అధికారుల చేతుల్లో చిక్కి, విలవిల్లాడి పోవచ్చు. చిక్కి శల్యమై పోవచ్చు. ఈ విపత్తే జరిగితే? అమ్మో! ఈ అవాంతరాన్ని ఎదుర్కొనే మార్గాన్వేషణలోనే రంగనాయకుల పదునైన బుర్ర పథకాల మీద పథకాలు అల్లుతున్నది. అలిసి పోతున్నది. పోనీ, గోడౌన్స్‌లో అతి గుప్తంగా తాను భద్రపరిచిన ఆ సరుకును ఏ సురక్షిత ప్రాంతానికైనా తరలిద్దామంటే వీలు లేకుండా ఈ పాడు వర్షమొకటి. వర్షాన్ని, అధికారుల్ని కట్టగట్టి కసితీరా తిట్టాడు రంగనాయకులు.


గజిబిజిగా చిక్కుపడ్డ రంగనాయకుల మనసు కేదో గమ్యం దొరికింది. కొన ప్రాణాలతో జారిపోయిన కోరమీసాలు తిరిగి నిటారుగా నిలబడ్డాయి. ప్రకృతిలో మెరుపు. రంగనాయకుల పెదాలపైన చిరునవ్వు. పేదవాని గుడిసెలు అగ్నికాహుతి అయినప్పుడు భగభగలాడే ఎర్రటి నిప్పు కణికలాటి దా నవ్వు. మెల్లగా మెట్లు దిగి, అస్తిని కోల్పోయి తన అండ చేరిన మేనల్లుడు చంద్రం గది వైపు బయలుదేరాడు రంగనాయకులు.

"చంద్రం!"

"ఏమిటి, మామయ్యా?"

మామయ్యా అనే సంబోధన రంగనాయకుల నరాల్ని నలిపింది. గుండెను గుంజింది. అయినా, లౌకికం జీర్ణించుకొన్న మెదడు ఆగ్రహాన్ని పైకి చిమ్మనీయలేదు.

"చంద్రం, నీతో పని పడిందోయ్."



ఇటీవల మద్రాసులో జరిగిన సంగీతోత్సవాలలో కర్ణాటక సంగీత కచేరీచేసి అందరి మన్ననలు అందుకున్న సంగీత విద్వాన్ శ్రీ తాడేపల్లి లోకనాధ శర్మ

"నా తోనా!"

"అవును. పైకి రా."

రంగనాయకులు మెట్ల వైపు నడిచాడు. చంద్రం అనుసరించాడు. పలునైనా దువ్వందే పాలివ్వదనే ప్రాథమిక సూత్రం నుండి, ఆధునికమైన ఫాల్స్ ట్రిక్స్‌లోని అణువణువును అతి మెలకువగా జీర్ణించుకొన్న రంగనాయకుల బుర్ర చురుగ్గా పని చేస్తున్నది. చంద్రానికి సన్నిహితంగా నటిస్తున్నది.

పైకి చేరిన రంగనాయకులు పదినరాలను నిదానంగా పరిశీలించాడు. పాయలు తీసి చుట్ట చుట్టాడు. చివర ఎర్రగా, కణికలా కనిపించేంతవరకూ చుట్టను కాల్చాడు. మీసాలను సున్నితంగా దువ్వుకొన్నాడు. ఇంతసేపూ మౌనంగా ఆయన చర్యల్ని పరిశీలిస్తూ ఉండిపోయాడు చంద్రం. పీల్చిన పొగను బయటకు పంపాడు రంగనాయకులు. ఖాండ్రించి బయటకు ఊశాడు. చంద్రం వంక చూసీ చూడనట్టు చూసి, "మన గోడౌన్స్ ఉన్నాయి చూశావూ?" అన్నాడు.

"ఉత్తరపు వైపువేనా, మామయ్యా?"

"ఆఁ. . .ఆఁ."

"పోయి చూసిరానా?"

"అవసరం లేదు."

"మరి?"

"అవి నీ పేర మారుస్తున్నానోయ్."

"మామయ్యా!"

"ఆశ్చర్యపడకు. నాకా ఈ వాజకీయాల్లో క్షణం తీరిక లేదు. ఆ గోడౌన్స్‌ను స్వయంగా చూసుకొనే వెసులుబాటూ లేదు. మంచి చెడ్డలు స్వయంగా చూసుకోలేనప్పుడు వ్యాపారం నిలబడి పోతుంది; లేదా ఎదురు తిరుగుతుంది."

అర్థాంతరంగా పెల్లుబికిన రంగనాయకులు వాత్సల్యానికి మొదట విస్తుపోయినా, తనను తాను తమాయించుకొన్నాడు చంద్రం.

"ప్రత్యేకించి నా పేర నెందుకు, మామయ్యా! ఆ వ్యవహారాలన్నీ నేను దగ్గరుండి చూసుకొంటాను."

"అట్లా అనకు. పెద్దవాణ్ణి చెప్పుతున్నా—విను. ఎంత సంపాదించినా చివరకు ముట్టచెప్పాల్సింది మీకేగా? ఈ ఆస్తితోబాటు ఒక్కగా నొక్క కూతురు భవిష్యత్తునుకూడా నీ చేతుల్లోనే పెట్టాలి మరి. ఈ బాధ్యతల్నుండి, ఈ బరువుల్నుండి తప్పుకొని నన్ను కాస్త విశ్రాంతి తీసుకోనీ."

"అయినా. . ."

"ఎదురు చెప్పకు."

"నీ ఇష్టం, మామయ్యా." నిర్లిప్తంగా అన్నాడు చంద్రం.

ఆ గోడౌన్స్, వాటి తాలూకు వివరాలూ అన్నీ ఆ సాయంత్రమే చంద్రం పేరుమీదుగా మార్చబడినాయి. రంగనాయకుల మనసును చుట్టుముట్టిన అలజడి తాత్కాలికంగా సర్దు మణిగింది. కళ్ళ ముందే నిలబడ్డ భూతం కాస్త కనుమరుగైనట్లైంది. ముందు జరగబోయేదాన్ని తలుచుకొంటూ పడక కుర్చీలో పడుకొన్న రంగనాయకులకు విడుపు లేకుండా వినిపించే తలుపు చప్పుడు చీకాకు కలిగించింది. చిర్రుమంటూ లేచి వీధి తలుపులు తీశాడు. ఎదురుగా నిలబడి ఉన్న వ్యక్తుల్ని అవాక్కై చూస్తూ ఉండిపోయాడు రంగనాయకులు.

"రంగనాయకులు మీరేనా?"

"అవును."

"మీ గోడౌన్స్ చెక్ చేయాలి."

"మీరు?"

"విజిలెన్స్ డిపార్ట్‌మెంట్."

రంగనాయకుల గుండెల్లో రేసు కుక్కల అరుపులు. కాళ్ళ కింద డైనమైట్లు. ఉదయం తన కందిన సమాచారం నిజమేనన్న మాట. ఎంతలో ఎంత ఉపద్రవం తప్పింది! ఎంత ఉప్పెన తొలగిపోయింది!

"ఆ గోడౌన్స్‌కూ, నాకూ సంబంధం లేదు."

"మరెవరి కున్నది?"

"నా మేనల్లుడు చంద్రం అజమాయిషీలోనే అవి నడుస్తున్నాయి."

"ఎప్పట్నుండి?"

"అవి పెట్టిన నాటినుండి."

"ఆ గోడౌన్స్‌ను కట్టించిం దెవరు?"

"పునాదులు వేసింది మాత్రం నేను. వ్యవహారం నడిపేది చంద్రం."

"అతనుండే దెక్కడ?"

వెనకాలే నిలబడ్డ చంద్రాన్ని రంగనాయకులు గమనించలేదు.

"నేనే చంద్రాన్ని."

"మీరు మాతో రావాలి."

అంగీకరించినట్లుగా తల ఊపాడు చంద్రం.

"రంగనాయకులుగారూ, మీరు కూడా రండి."

"ఇతరుల వ్యవహారాల్లో నేను తల దూర్చటం. . ."

"మీ అవసరంకూడా ఉంది. వచ్చి తీరాలి." నిష్కర్షగా అన్నాడు ఆ వచ్చిన వాళ్ళలో ఒక అధికారి.

సర్ది చెపుదామన్నా, దబాయించి దాటేద్దామన్నా తన మాటకారితనం, పెంచుకొన్న పలుకుబడి ఈ వచ్చిన వాళ్ళ ముందు తల వంచుకొన్నాయి. మూగగా అనుసరించాడు రంగనాయకులు వాళ్ళను.

బయట వర్షం జోరు కాస్త తగ్గినా, రంగనాయకుల మనసులో మళ్ళీ హోరు మొదలైంది. ఉద్వేగం హెచ్చింది కూడా. ఈ వచ్చిన అధికారుల్ని ఆకట్టుకొనే దెలా? ఏ ఆశ చూపించి వీళ్ళని చల్లబర్చాలి? పరిష్కారం దొరకని ఆలోచనల మధ్య రంగనాయకులు కొట్టుకు మిట్టుకు లాడి పోతున్నప్పుడే గోడౌన్స్ ముందాగింది జీపు.

చంద్రం తాళాలు తన కీళ్ళ నెవరో

తల్లడిల్లి పోయాడు రంగనాయకులు. ఓడలో నుండి నడిసముద్రంలోకి విసిరి వేయబడ్డట్లు తనన చెందాడు. ఇంత వనుచాటు సరుకు ప్రభుత్వ వశమై పోవచువా? ఇన్ని లక్షలు తన నుండి గుంజుకోవటమా? అక్రమ నిల్వల పేరిట ఎంత రభస? ఎన్ని సంజాయిషీలు! కాలం ఎదురు తిరిగి ఈ గోడౌన్స్ తనవే నన్న యథార్థం వెలికి వస్తే జైలుప్రాప్తి తప్పదు తనకు. రంగనాయకులు నరాల్లో రక్తం గడ్డ కట్టుకు పోతున్నట్లుగా విలవిల్లాడి పోయాడు.

గోడౌన్స్ తలుపులు బార్లా తెరిచాడు చంద్రం. ఉగ్గబట్టి నిలబడ్డ రంగనాయకులు తెరిచిన నోరు తెరిచినట్లే ఉండిపోయింది. ప్రశ్నార్థకంగా ముడిచిన కనుబొమలు అట్లాగే నిలబడిపోయినాయి. ఇది మాయా? మోసమా? గోడౌన్స్ అన్నీ ఖాళీ. పుల్లాపుల్లా పేర్చి కష్టపడికట్టుకున్న గూడును ఏ పోకిరి పిల్లవాడో పాడు చేసి నేలకు విసిరేస్తే, ఆ కాకి ఎంతగా విలపిస్తుందో రంగనాయకుల మనసూ అట్లాగే రోదించసాగింది.

"అయామ్ సారీ. మా కందిన రిపోర్ట్సును బట్టి వీటిని చెక్ చేయాల్సి వచ్చింది." ఆ వచ్చిన వారిలో పెద్ద అధికారి రంగనాయకుల్ని, చంద్రాన్ని ఉద్దేశించి అన్నాడు.

ఈ సారీ లేవీ రంగనాయకులు బుర్రను చేరలేకపోతున్నాయి. తరలి పోయిన సరుకుతోబాటు రంగనాయకుల గుండెకూడా చెదిరిపోయింది. ఒకటా? రెండా? కొన్ని లక్షల రూపాయలు కిమ్మత్తు చేసే ఆహారధాన్యాలు. తనే దగ్గరుండి గోతాల్లో కెక్కించి, భద్రంగా కుట్టించి, అంతకంటే భద్రంగా ఈ రహస్యస్థావరంలో రెండో కంటికి తెలియకుండా దాచాడు. ఎటు పోయిన ట్లు సరుకంతా? ఉన్నచోట ఉండకుండా ఎటెటో ప్రవహించే వాన నీరు గుర్తు కొచ్చి కదలబారిపోయాడు రంగనాయకులు. ఈ ఘోర దోపిడీని చేయించిం దెవరో అంచనా వేసుకోవటం లోనే అతని మనస్సు విలవిల్లాడిపోయింది.

పట్టిన మునురు తొలగిపోయింది. తనకు పరిచయమైన వాళ్ళను, పనిబడి వచ్చిన వాళ్ళను ఆపాదమస్తకం ఎక్స్-రే కళ్ళతో పరిశోధించటం రంగనాయకులకు ఒక అలవాటుగా మారిపోయింది. ప్రత్యర్థి వర్గాల మీద ఎన్ని వలలు వేసినా, ఎన్నెన్ని వ్యూహాలు పన్నినా మాయమైన తన సరుకు ఆచూకీ మాత్రం ఏ కొంచెమైనా అందలేదు. ఈ విషాదాన్ని కక్కలేక, మింగలేక అల్లాడి పోయాడు రంగనాయకులు. ఈ లోపు చంద్రం ఎదురుబడ్డా, అప్యాయత వెదజల్లట మటుంచి, అసలు పలకరించటం కూడా వెగటుగా తోచింది రంగనాయకులకు.

వారం రోజులు గడిచినాయి. గోడౌన్స్ నుండి మాయమైన సరుకు తాలూకు నష్టంతోనే కుతకుతలాడి పోతున్న రంగనాయకులు మనసు, ఇప్పుడు కూతురు తెచ్చి పెట్టిన సంక్షోభంతో గానుగలో నలిగిన నువ్వుగింజలా చితికి చితికిపోయింది. గోరుచుట్టుపై రోకటి పోటులా, ఒక వైపరీత్యం తరవాత మరో వైపరీత్యం వెన్నంటి వేధించటంతో రంగనాయకులు ఏదో ఊబిలోకి కూరుకు పోతున్నట్లుగా అల్లాడిపోయాడు. అపరంజిబొమ్మలా తాను చూసుకొంటూ వచ్చిన తన ముద్దుల కూతురు వివాహం కాకుండానే నెల తప్పింది. ఆమె భవిష్యత్తు గూర్చి తాను కంటున్న కలలు, పెంచు కొంస్తున్న అంతస్తులు అన్నీ ఎదురు తిరిగి తన ముందరే వికారంగా నవ్వుతున్నట్లు కల్లోల పడిపోయాడు రంగనాయకులు. దిగజారిపోతున్న తన పరువు ప్రతిష్ఠల్ని తిరిగి నిలబెట్టుకొనే దెలా? సర్పాల్లా చుట్టు ముట్టిన ఈ సమస్యల్నుండి బయట పడే దెలా? ఈ ఆలోచనలతో సతమతమై పోతూనే కూతురు గది వైపు నడిచాడు రంగనాయకులు.

దిండులో తల దూర్చి వెక్కి వెక్కి ఏడుస్తున్న కూతుర్ని చూసిన రంగనాయకుల మనసు పొరలలో మరుగుతున్న ఆగ్రహం మంచులా కరిగిపోయింది. ఆవేశంలో పురెక్కిన నరాలు మెల్లగా విచ్చుకొన్నాయి. పోయి కూతురు పక్కనే కూర్చున్నాడు. ఆప్యాయంగా తల నిమిరాడు. తండ్రి స్పర్శతో తలఎత్తి చూసిన సుధ పొంగు కొచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక బావురుమంది.

"ఈ పొరపాటెందుకు జరిగిందమ్మా?"

"నా తెలివి తక్కువతనం, నాన్నా."

"ఎవరతను?"

". . ."

"చెప్పమ్మా, ఎవరతను?"

"ప్రయోజనం లేదు, నాన్నా."

"ఏమైనా అన్నాడా?"

"మోసపోయా న్నాన్నా. ఇదంతా నా ఖర్మ."

అనునయంగా కూతురు భుజంమీద చేయి వేసి నిమిరాడు రంగనాయకులు.

"ఎక్కడున్నా డతడు?"

"అమెరికా వెళ్ళాడు."

"అమెరికానా? !"

వాసన చూసి దూరాన ఉన్న మనుషుల మనస్సుల్ని చదవగలిగే రంగనాయకుల మేధ మొవ మొదలంటా విరిగిన థర్మామీటరులా నిరుపయోగమైంది ఆ క్షణంలో.

"అవు న్నాన్నా. యూనివర్సిటీ స్కాలర్‌షిప్ మీద వెళ్ళాడు. వెళ్ళే ముందు నే నెంత ప్రాధేయపడి పెండ్లి సంగతి ప్రస్తావించినా, ఇప్పు డెట్లా వీలవుతుందంటూ వెళ్ళిపోయాడు."

"అంత నీచుడితో సన్నిహితత్వ మెట్లా పెంచుకొన్నావమ్మా?"

తండ్రి గుండెలపై తల వాల్చి మరోసారి బావురుమంది సుధ.

తన గోడౌన్స్ విషయం బయటకు పొక్కి అందులోని సరుకు రెండో కంటికి తెలియకుండా కదిలిపోయిననాడే తన శక్తియుక్తులకు పక్షవాతం వచ్చినట్లుగా కల్లోలపడి పోయాడు రంగనాయకులు. ఇప్పుడు కూతురు సమస్యతో రంగనాయకులు స్థితి వేటగాడి బాణం దెబ్బతిన్న పక్షిలా గిజగిజలాడిపోయింది.

ఉన్నట్లుండి కావురు గమ్మిన రంగనాయకుల మనోవీథిలో ఒక నక్షత్రం మెరిసింది. దాని తాలూకు చిరు వెలుగుతో, నిట్టూర్పుంతో మ్లానమైన అతని ముఖం క్షణకాలం కాంతివంతమైంది.

"అమ్మా, సుధా!"

"ఏం, నాన్నా?"

"ఇప్పుడు నే నేం చేసినా నువ్వు అడ్డు చెప్పకూడదు."

అనాసక్తంగా తల ఊపింది సుధ. బయటకు నడిచాడు రంగనాయకులు.

• • •

ఒక వారం రోజుల తరవాత చంద్రానికి, కూతురికి వైభవంగా వివాహం జరిపించాడు రంగనాయకులు. మేనల్లుడి పట్ల రంగనాయకులలో పొర్లిపోయే ఉదారతను, ఆప్యాయతను పెండ్లి కొచ్చిన పెద్దలంతా అదేపనిగా కీర్తించారు. రంగనాయకులు మనస్సు కొంత సర్దుమణిగింది. కళ్ళు కునుకు తీయటం తిరిగి నేర్చుకొన్నాయి.

ఒకానొక రాత్రి రంగనాయకులు దీర్ఘాలోచనలో చిక్కుకొని, పొగాకు పాయలు విప్పుకొంటున్న తరుణంలో పైన గదిలో చంద్రం గుండెల మీద తల వాల్చిన సుధ— "నా కడుపులో పెరిగేది నీ రూపమే నని నాన్న కిప్పుడైనా చెబుదామా, చంద్రం!" అంది.

"నీ ఇష్టం" అంటూ సుధను మరింతగా తనలో కలుపుకొన్నాడు చంద్రం.

అదే సమయంలో వెన్నెల కింద నిద్రకు ఉపక్రమిస్తూ హరిజనవాడ ఈ విధంగా అనుకొంది:

"చందరం గోరి దయవల్ల ఈ ఏడు తిండిగింజల ఎతుకులాట తప్పింది!" ★

